

సదర్మాట్ ప్రత్యేక కాలువ కల నెరవేరేనా?



- ఏడు కిలోమీటర్ల ఎగువన బ్యారేజీ నిర్మించడంపై నాడు ఉవ్వెత్తున ఉద్యమం
- 8 ఏళ్లుగా ఖానాపూర్ ప్రాంతాల రైతుల్లో ఆందోళన
- 2018లో నాటి సీఎం కాలువ నిర్మాణంపై హామీ
- సదర్మాట్ ప్రత్యేక కాలువ నిర్మాణం ఎన్నికల హామీగా మారుతోందని రైతుల ఆవేదన
- నాటి ప్రభుత్వం విస్మరించినా.. నేటి ప్రభుత్వంపై రైతాంగం ఆశలు

ఖానాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఖానాపూర్, కడెం మండలాల రైతులకు వరప్రదాయిని అయిన సదర్మాట్ బ్యారేజీ నిర్మాణానికి నాటి ప్రభుత్వం 2017లో రూ. 516 కోట్లు మంజూరు చేసింది. అయితే ఖానాపూర్ శివారులోని పురాతన సదర్మాట్ ఆనకట్ట వద్ద కాకుండా దానికి ఏడు కిలో మీటర్ల ఎగువన ఉన్న నిర్మల్ నియోజకవర్గంలోని మామడ మండలం పొన్కల్ వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టారు. దీంతో ఖానాపూర్ నియోజకవర్గ రైతులు అప్పటి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనలు చేశారు. ఇలా చేయడం వల్ల బ్యారేజీ నుంచి సాగునీరు తమకు రాకుండా నేరుగా మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న జగిత్యాల జిల్లాకు వెళ్తుందని మండిపడ్డారు. ఇలా అయితే తమకు నీరు రాక పంటలు పూర్తిస్థాయిలో ఎండుతాయని సంవత్సరం పాటు ఆందోళనలతో హోరెత్తించారు. దీంతో దిగొచ్చిన అప్పటి రాష్ట్రప్రభుత్వం పొన్కల్ బ్యారేజీ నుంచి సదర్మాట్ ఆనకట్ట వరకు ఏడు కిలోమీటర్ల మేర ప్రత్యేకకాలువ నిర్మాణం చేపట్టి సదర్మాట్ రైతులకు మొదటి ప్రాధాన్యతగా సాగు నీరందిస్తామని ప్రకటించింది. కానీ గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేకకాలువ నిర్మాణం చేయలేకపోయారు. తమ ప్రభుత్వం ఏర్పడితే సదర్మాట్ బ్యారేజీ నుంచి ఆనకట్ట వరకు ఏడు కిలోమీటర్ల మేర ప్రత్యేక కెనాల్ నిర్మాణం జరుగుతుందని ఎన్నికల వేళ కాంగ్రెస్ నాయకులు సైతం ఈ ప్రాంత రైతాంగానికి హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికీ ప్రత్యేకకాలువ నిర్మాణంపై స్పష్టత రాకపోవడం పట్ల రైతాంగం అయోమయంలో ఉన్నారు.

ఎన్నికల హామీగా మారుతున్న ప్రత్యేక కెనాల్ నిర్మాణం

సదర్మాట్ బ్యారేజీ నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఈ ప్రాంత రైతుల్లో నెలకొన్న ఆనందం బ్యారేజీని పాత ఆనకట్ట వద్ద కాకుండా ఎగువన నిర్మిస్తున్నారని తెలిసి ఆవిరైపోయింది. ఆనకట్ట వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని రైతులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఖానాపూర్ నియోజకవర్గంలో 2017, 2018 సంవత్సరాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. అయితే 2018 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నవంబరు 22వ తేదీన ఖానాపూర్‌కు వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్ ఈ విషయంపై స్పందించారు. సదర్మాట్ నీటిపై ఈ ప్రాంత రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని సూచించారు. ప్రస్తుతం పొన్కల్ వద్ద నిర్మాణమవుతున్న సదర్మాట్ బ్యారేజీ నుంచి సదర్మాట్ ఆనకట్ట వరకు ఏడు కిలోమీటర్ల మేర ప్రత్యేక కాలువ నిర్మించి సుమారు 30 వేల ఎకరాల పాత ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరందేలా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. కానీ మరో మారు అధికారంలోకి వచ్చాక కెనాల్ నిర్మాణ హామీని నెరవేర్చలేకపోయారు. ఆ తర్వాత ఐదేళ్లకు వచ్చిన ఎన్నికల్లో సైతం సదర్మాట్ ప్రత్యేక కెనాల్ హామీ తెరపైకి వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఈసారైనా సదర్మాట్ ప్రత్యేక కెనాల్ నిర్మాణం చేపట్టాలని ఈ ప్రాంత రైతాంగం కోరుతోంది.

త్వరలో గోదావరిలో డైవర్షన్ వాల్స్ నిర్మాణం

సదర్మాట్ బ్యారేజీ నుంచి పాత ఆనకట్ట వరకు నీరు చేరేందుకు గోదావరి నదిలో డైవర్షన్ వాల్స్ నిర్మాణం చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. బ్యారేజీ నుండి ఒక కిలోమీటర్ దూరంలో ఒక డైవర్షన్ వాల్ 6 కిలోమీటర్ల దూరంలో మరో డైవర్షన్ వాళ్లను నిర్మించనున్నట్లు నీటి పారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. ఇందుకుగాను ప్రభుత్వం బ్యారేజీ నిర్మాణంలోనే రూ.మూడు కోట్ల నిధులను కేటాయించిందన్నారు. మే నెలలో డైవర్షన్‌వాల్స్ నిర్మాణం పనులు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ డైవర్షన్ వాల్స్ నిర్మాణం పూర్తయితే గోదావరి నది ద్వారా 500ల క్యూసెక్కుల నీటిని నేరుగా సదర్మాట్ వరకు తరలించవచ్చని చెబుతున్నారు.

ఏడు కిలో మీటర్ల కాలువ నిర్మాణానికి ఎన్నో అడ్డంకులు

ఖానాపూర్, కడెం మండలంలో రైతాంగానికి సదర్మాట్ బ్యారేజీ నుంచి నేరుగా నీటిని అందించాలంటే నిర్మించాల్సిన ప్రత్యేకకెనాల్ నిర్మాణం కోసం మార్గమధ్యంలో ఎన్నో అడ్డంకులను అధిగమించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కాలువ నిర్మాణం కోసం పూర్తిగా 70 ఎకరాల వరకు భూమి అవసరం పడుతుందని అందులో 40 ఎకరాల భూమి అటవీ భూభాగంలో ఉందని చెబుతున్నారు. ఆ భూమి సేకరణకు అటవీ శాఖ నుంచి అనుమతులు తీసుకోవడం ఇబ్బందికరంగా మారుతుందంటున్నారు. మిగతా 30 ఎకరాల భూమి కూడా ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన భూమి ఉందని అక్కడ భూమి మార్కెట్ ధర అధికంగా ఉంటుందని చెబుతున్నారు. ఏడు కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణంలో మూడు వాగులు అడ్డుగా ఉన్నాయని వాటి వంతెన నిర్మాణానికి సైతం అధికమొత్తంలో నిధులు కావాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడు కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణానికి సుమారు రూ. 60 నుంచి 70 కోట్లు నిధులు వెచ్చించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ప్రత్యేక కెనాల్ నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ వివరాలు కోరడంతో పై అంశాలన్నింటితో కూడిన నివేదికను అందజేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు ప్రత్యేకకెనాల్ నిర్మాణం విషయంలో తమకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని అధికార యంత్రాంగం చెబుతోంది. ఇన్ని అడ్డంకుల నడుమ ప్రత్యేక కెనాల్ నిర్మాణంపై ఈ ప్రభుత్వంలోనైనా ముందడుగు పడుతుందా లేక ప్రత్యేక కెనాల్ నిర్మాణం కలగానే మిగులుతుందా అని సదర్మాట్ రైతాంగం మదిలో సంశయం మెదులుతోంది.

ఏడు కిలో మీటర్ల మేర కాలువ నిర్మాణం వెంటనే చేపట్టాలి

● హపావత్ రాజేందర్, సదర్మాట్ కాలువ సాధన సమితి అధ్యక్షుడు

సదర్మాట్ బ్యారేజీ నిర్మాణాన్ని ప్రస్తుతం ఉన్న ఆనకట్ట ఎగువన ఏడు కిలో మీటర్ల పైన చేపట్టడంతో ఈ ప్రాంత రైతులకు అన్యాయం జరుగుతోంది. వెంటనే బ్యారేజీ నుంచి మొదటి ప్రాధాన్యతగా సదర్మాట్ ఆనకట్టకు నీరొచ్చేలా ఏడు కిలోమీటర్ల మేర ప్రత్యేకకాలువ నిర్మించాలి. గత ముఖ్యమంత్రి హామీ ఇచ్చి మాట తప్పారు. ఈ కాలువ నిర్మాణం అనే అంశం ఎన్నికల హామీగా మార్చుతున్నారు. దీంతో నీటి కోసం నిరంతరం అధికారులు, నాయకుల చుట్టూ రైతాంగం తిరగాల్సి వస్తోంది.

మే నెలలో డైవర్షన్ వాల్స్ నిర్మాణం చేపడతాం



● సురేందర్ రాథోడ్, డీఈ, సదర్మాట్

సదర్మాట్ బ్యారేజీ నుంచి విడుదలయ్యే నీరు గోదావరిలో వృథాగా వెళ్లకుండా పాత ఆనకట్ట వరకు చేరేలా రూ.3 కోట్ల నిధులతో డైవర్షన్ వాల్స్ నిర్మాణం చేపడుతాం. మే నెలలో పనులు ప్రారంభిస్తాం. ప్రత్యేక కెనాల్ నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే కోరిన నివేదిక అందజేశాం.

రైతులకు ఇబ్బందులు కలుగకూడదు

● వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, జిల్లా అధికారులు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : యాసంగి పంటల కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండాచూడాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్. చౌహాన్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. జిల్లాల వారీగా ఇప్పటి వరకు పూర్తి చేసిన ధాన్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... అన్ని జిల్లాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తరుగు పేరిట రైతులకు ఎటువంటి కోతలు పెట్టవద్దని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసే పరిస్థితులు ఉన్నందున ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. దేశంలో అత్యధికంగా వరి పంట పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందన్నారు. వానకాలం పంట కొనుగోలు సజావుగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించినందుకు అధికారులందరికీ మంత్రి అభినందనలు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటి వరకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన వివరాలను మంత్రికి కలెక్టర్ తెలియజేశారు. నిర్ణీత సమయానికి జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఇటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలును నిర్వహిస్తున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంచిర్యాల జిల్లా అధికారి కుమార్‌దీపక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : డీఈవో

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోత) : జిల్లాలో రేపటి నుంచి నిర్వహించే పది, ఇంటర్ సార్వత్రిక పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్టు డీఈవో రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 వరకు ప్రతీరోజు ఉదయం 9 నుంచి 12, మధ్యాహ్నం 2:30 నుండి 5:30 వరకు పరీక్షలుంటాయన్నారు. భైంసా కిసాన్‌గల్లి, నిర్మల్ బాలికల పాఠశాల, కస్బాలో పది పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులకు భైంసా ప్రభుత్వ పాఠశాల మదీనా కాలనీ, నిర్మల్ ఈద్గామ్, జుమ్మెరాత్‌పేట్ హైస్కూళ్లలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. నిర్వహణ కోసం సీఎస్, డీవోలు, సిట్టింగ్ స్క్వాడ్ సహా ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. పది పరీక్షకు 660, ఇంటర్ 458 విద్యార్థులు హాజరు కానున్నట్టు తెలిపారు. ఐదు నిమిషాలకు మించి ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతించబోమన్నారు. మొబైల్ ఫోన్లను తీసుకురావద్దని సూచించారు. సందేహాల నివృత్తికి 9059987730 కంట్రోల్ రూమ్‌కు సంప్రదించాలన్నారు. ఇంటర్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలు 26 నుండి మే మూడు వరకు ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహిస్తారన్నారు.

ఒకే పాఠశాల నుంచి 29 మంది విద్యార్థులకు గురుకుల సీట్లు

లోకేశ్వరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజూర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులలో 29 మంది విద్యార్థులకు గురుకులలో సీట్లు సాధించారు. ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్, ఉపాధ్యాయులు, గ్రామ వీడీసీ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

దుబాయ్ నుంచి సోన్ చేరుకున్న ప్రేమ్ సాగర్ మృతదేహం

● మృతదేహానికి సోన్ గోదావరి వద్ద అంత్యక్రియలు పూర్తి



ప్రేమ్‌సాగర్ మృతదేహాన్ని చూసేందుకు తరలివచ్చిన జనం

సోన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : వారం రోజుల క్రితం దుబాయ్‌లోని మోడ్రన్ బేకరీలో హత్యకు గురైన ప్రేమ్‌సాగర్ మృతదేహం ఆయన స్వగ్రామమైన సోన్‌కు శనివారం ఉదయం చేరుకుంది. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిల కృషి మేరకు ప్రేమ్‌సాగర్ మృత దేహాన్ని ఎంబసీ అధికారులు దుబాయ్ నుండి స్వదేశానికి రప్పించారు. కాగా సోన్ గ్రామానికి ప్రేమ్ సాగర్ మృతదేహం చేరుకోగానే ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్థులంతా శోక సముద్రంలో మునిగిపోయారు. అశ్రు నయనాల మధ్య ప్రేమ్ సాగర్ మృత దేహానికి సోన్ గోదావరి వద్ద అంత్యక్రియలు నిర్వహించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ అప్పుల బాధ్యతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బి. శ్రీనివాస్ ఈ నెల 17న ఇంటి నుండి పనికి వెళ్తున్నాని వెళ్లాడు. అప్పటి నుండి అతని ఆచూకీ కోసం వెతుకగా శనివారం మండలంలోని మూఠాపూర్ శివారులో గల సరస్వతి కెనాల్ సైఫాన్ వద్ద అతని మృతదేహం లభించిందని తెలిపారు. తన భర్త కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని, ప్రైవేట్ అప్పులు బాగా చేశాడని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో జిల్లా విద్యార్థులకు జాతీయ స్థాయి ర్యాంకులు

నిర్మల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని విజయనగర్ కాలనీకి చెందిన ఉపాధ్యాయ దంపతులు పోతుల్‌వార్ సురేష్ షైసర్ల స్వప్నల కుమారుడైన పోతుల్‌వార్ సృజన్‌కుమార్ జేఈఈ మెయిన్స్‌లో 99.96 పర్సెంటేజ్ సాధించాడు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సృజన్‌కుమార్ జాతీయస్థాయిలో 683 కామన్ ర్యాంక్‌ను, ఓబీసీ విభాగంలో 105 ర్యాంక్‌ను కైవసం చేసుకున్నాడు. కాగా నిర్మల్ పట్టణంలో నివాసముండే సంజీవ్‌కుమార్, చింతప్రభ దంపతుల కుమారుడైన అటోలి రుతిక్‌కుమార్ 99.89 పర్సంటేజ్ సాధించి ఓబీసీ కోటాలో 301 ర్యాంక్‌ను కైవసం చేసుకున్నాడు. కాగా ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ నహీద్ పాషా కుమారుడైన సయ్యద్ రియాజ్ కూడా 99.88 పర్సంటేజ్ సాధించి జేఈఈ మెయిన్స్‌లో విజయ కేతనం ఎగరేశాడు.

చుచుంద్ ఉన్నత పాఠశాల నిర్వహణకు విరాళాలు

భైంసా, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి); మండలంలోని చుచుంద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్వాహణ కోసం గాను పలువురు దాతలు విరాళాలు అందించారు. శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంతెన వెంకటేశ్వర్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో విరాళాలు వెల్లువెత్తాయి. బోరిగాం పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు ప్రజోత్‌కుమార్, చుచుంద్ ఉన్నత పాఠశాలలో స్టేజీ నిర్మాణం కోసం రూ. 40వేల విరాళాలు అందించారు. గ్రామానికి చెందిన కే. దత్తురాం సౌండ్ సిస్టమ్ ఏర్పాటుకు గాను రూ. 18వేలు, పీ. మహేష్ కుమార్ ప్యూరిఫైడ్ వాటర్ సిస్టమ్ కోసం గానూ రూ. 30వేలు, భైంసాకు చెందిన జేకే నాగభూషణ్ పటేల్ వంద స్టీల్ ప్లేట్ల కోసం గాను రూ. 10వేలు, ఎక్సైజ్ శాఖ సీఐ వెంకటేష్ పోడియం ఏర్పాటుకు రూ. 5వేలు విరాళంగా అందించారు.

ఆధ్యాత్మిక పాదయాత్ర చేసిన భక్తుడికి సన్మానం

దిలావర్‌పూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : దిలావర్‌పూర్ నుంచి వారణాసి (కాశీ) వరకు పాదయాత్ర చేసిన కుస్తపురం భూమేష్‌ను శనివారం భారత రాష్ట్ర సమితి నాయకులు ఘనంగా సన్మానించారు. కుస్తపురం భూమేష్ 38 రోజుల్లో ప్రయాగ్‌రాజ్, అయోధ్య మీదుగా వారణాసికి 1306 కిలోమీటర్ల పాదయాత్ర చేసి మొక్కులు చెల్లించుకుని తిరిగి వచ్చారు. కాగా శనివారం మండల కేంద్రంలోని ఏక్‌నాథ్ మందిరంలో సత్యనారాయణ వ్రతం చేశారు.

ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

● రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి. అనసూయ సీతక్క



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష జరుపుతున్న మంత్రి సీతక్క



హాజరైన ఆయా శాఖల అధికారులు

నిర్మల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి. అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్ మిషన్ భగీరథ, మహిళా, శిశు సంక్షేమంపై ఉమ్మడి జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న మంత్రికి పోలీసులు గౌరవ వందనం ఇచ్చారు. అనంతరం మహిళా పోలీసులచే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'శివాంగి' బృందాన్ని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఇది రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. జిల్లాలోని సమాఖ్య సంఘాలకు, మెప్మాలకు మంజూరైన చెక్కులను మంత్రి, కలెక్టర్ అభిలాష అభినవ్, ప్రజా ప్రతినిధుల సమక్షంలో పంపిణీ చేశారు. బ్యాంకు లింకేజీ, రుణాల మంజూరు, వసూలులో నిర్మల్ జిల్లా ప్రగతిశీలంగా ఉందని మంత్రి ప్రశంసించారు. అనంతరం పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి, టెండర్ దశ నుంచే పనులు వేగవంతంగా ప్రారంభించి, వర్షాకాలనికి ముందే పూర్తి చేయాలన్నారు. ఇప్పటికీ ప్రారంభం కాని పనులకు వెంటనే కొత్త టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. ఆలస్యం చేస్తున్న గుత్తేదారులకు నోటీసులు జారీ చేసి పనులు పూర్తి చేయించాల్సిన అవసరం ఉందని సూచించారు. పనులన్నీ నాణ్యతతో ఉండాలని స్పష్టం చేశారు. వర్షాకాలం ప్రారంభానికి ముందు అభివృద్ధి పనులను పూర్తి చేయడం ఇంజనీరింగ్ అధికారుల బాధ్యత అని తెలిపారు. కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారికి తగిన సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. సాగునీరు చివరి తడి వరకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో త్రాగునీటి సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... నిర్మల్ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పనులు వేగంగా పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్రాగునీటి సమస్యలు ఎదురవకుండా ముందస్తు ఏర్పాట్లు చేశామని, సాగునీరు అందించేందుకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. అనంతరం జిల్లాల వారీగా అభివృద్ధి పనులపై మంత్రి చర్చించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్, సిర్పూర్, ఆసిఫాబాద్, బోథ్‌ల శాసన సభ్యులు మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్, పవార్ రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్, పాల్వాయి హరీష్ బాబు, కోవ లక్ష్మీ, అనిల్‌జాదవ్, ఇతర ప్రజాప్రతినిధులు, ఐసీడీఎస్ సెక్రటరీ అనితా రామచంద్రన్, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కుష్బూగుప్తా, దీపక్ తివారి, కిషోర్‌కుమార్, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

మంత్రికి స్వాగతం పలికిన గ్రంథాలయ చైర్మన్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మంత్రి సీతక్క శనివారం నిర్మల్ పర్యటనకు వచ్చిన సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ అర్జుమన్ అలీ స్వాగతం పలికారు. మధ్యాహ్నం ఆయన నివాసంలో భోజనానికి ఆహ్వానించి ఆతిథ్యం ఇచ్చారు. పలు సమస్యలు మంత్రి దృష్టికి తెచ్చారు. సమస్యలపై స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, ఆత్రం సుగుణ, సత్తు మల్లేష్, మాజీ కౌన్సిలర్లు తాహెద్ ఉద్దీన్, ఇమ్రాన్ ఉల్లా ఖాన్, షేక్ సయీద్, మతీన్, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి వెళ్లినా ఉపాధి హామీ డబ్బులు చెల్లిస్తున్నారు

● లక్ష్మణచాంద ఈజీఎస్‌లో అవినీతిపై స్థానికుడి వీడియో రిలీజ్ ● ఎంపీడీవో కలెక్టర్‌కు ఫిర్యాదు

లక్ష్మణచాంద, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పీచర గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నట్లు స్థానికుడైన బొజ్జ అశోక్ శనివారం ప్రెస్‌కు ఒక వీడియో రిలీజ్ చేశాడు. గ్రామానికి చెందిన రాజారపు సరోజ, రాజారపు భాగ్య అనే ఇద్దరు ఈ నెల 6వ తేదీన తిరుపతి వెళ్లి 17వ తేదీన తిరిగి వస్తే... ఈ నెల 7వ తేదీ నుండి 13వ తేదీ వరకు వారు ఉపాధి హామీ కూలీకి వెళ్లినట్లు మస్టర్‌లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో పేమెంట్ సిద్ధం చేశారని అందుకు సంబంధించిన ఆన్‌లైన్ ఆధారాలను కూడా రిలీజ్ చేశాడు. గ్రామంలో గల పలుకుబడి కలిగిన కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు, ఇతర వ్యక్తులు కూలీ పనికి వెళ్లకున్నప్పటికీ వారు పనికి వెళ్తున్నట్లు మస్టర్‌లో నమోదు చేసి చెల్లింపులు చేశారని ఆరోపించారు. అలా వచ్చిన డబ్బులు ఈజీఎస్ సిబ్బందితో కలిసి పంచుకుంటున్నట్లు భావిస్తున్నానన్నారు. గత మార్చిలో గ్రామంలో జరిగిన ఉపాధి హామీ సోషల్ ఆడిట్ గ్రామసభకు వెళ్లి ఈ అవినీతిపై ప్రశ్నిస్తు తనపై తప్పుడు కేసులు నమోదు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. పై విధంగా పని చేయకున్నా కూలీ డబ్బులు పొందుతున్న కొందరిని మాత్రమే గ్రామసభలకు పిలిచి ఈజీఎస్ సోషల్ ఆడిట్ సిబ్బందిని మేనేజ్ చేస్తున్నారన్నారు. ఈ అవినీతిపై స్థానిక ఎంపీడీవో రాధా రాథోడ్‌కు నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్‌కు లిఖిత పూర్వకంగా శనివారమే ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాబట్టి జిల్లా స్థాయి అధికారులు గ్రామానికి వచ్చి బహిరంగ సామాజిక తనిఖీ చేస్తే పెద్ద ఎత్తున అవినీతి బయటపడే అవకాశం ఉందని తెలిపారు. గత మార్చిలో జరిగిన మండల స్థాయి సామాజిక ప్రజావేదికలో వడ్యాల్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు వచ్చి ప్రతి ఉపాధి హామీ కూలీ వద్ద వారం వారం 100 రూపాయలు తీసుకుంటున్నారని, ఇవ్వని వారి కూలీ డబ్బులు ఇతరుల అకౌంట్‌లలో పడేలా చేస్తున్నారని లేదంటే తక్కువ రోజుల డబ్బులు చెల్లించి పూర్తి డబ్బులు చెల్లించకుండా సతాయిస్తున్నారని ఆరోపిస్తే డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మికి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో ఎంపీడీవో రాధా రాథోడ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు వచ్చిన విషయం నిజమేనని విచారణ చేసి బాధ్యుతలపై చర్యలు తీసుకుంటామన్నారు.

ముమ్మరంగా మురికి కాలువల నిర్మాణం

భైంసా, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాలుగవ వార్డు పరిధిలో గల శివాజీ నగర్ కాలనీలో మురికి కాలువ నిర్మాణపు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులు రూ.40 లక్షలతో సంబంధిత పనులు చురుకుగా జరుగుతున్నాయి. వార్డు పరిధిలో వేయి మీటర్ల మేర మురికి కాలువల నిర్మాణపు పనుల నిర్వాహణ జరుగుతోందని నాలుగవ వార్డు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ చందులాల్ తెలిపారు. ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ దృష్టికి వార్డు సమస్యలను తీసుకవెళ్లగా ఎస్‌డీఎఫ్ ద్వారా సంబంధిత అభివృద్ధి పనులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. అర్‌అండ్‌బీ శాఖ నిర్వాహణ పర్యవేక్షణలో మురికి కాలువల నిర్మాణపు పనులు జరుగుతున్నాయని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ చందులాల్ వివరించారు.



భానుడి భగ భగ

● తీవ్ర ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
● అత్యధికంగా 42.7 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు

ఖానాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శనివారం భానుడు తన ప్రతాపాన్ని ప్రదర్శించాడు. తెల్లవారిందే మొదలు భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. ఉదయం 10 గంటల నుండి తీవ్రమైన ఉక్కపోత నెలకొనడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నిర్మల్ జిల్లాలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఎండ తీవ్రత నుండి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఇక్కట్లు పడ్డారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోత) : బర్కత్‌పురా ప్రాంతంలో 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నందున ఆదివారం ఉదయం 7 నుండి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేత కలుగుతుందని అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. వేసవి దృష్ట్యా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మామడ మండలంలో..

మామడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మామడ మండలం 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ డి.బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కొరిటికల్, తాండ్ర, పరిమండల్, మామడ, రాయదారి, లింగాపూర్, మేడిపల్లి, ఆరేపల్లి గ్రామాలకు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉద్యమకారుల ప్లీనరీ సభ విజయవంతం చేయండి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21న సికింద్రాబాద్‌లో నిర్వహించే ఉద్యమకారుల ప్లీనరీ సభను విజయవంతంచేయాలని నాయకులు పాకాల రామచందర్, కొట్టే శేఖర్ ఒక ప్రకటనలో కోరారు. ఉద్యమకారుల సంక్షేమబోర్డు, నివాసస్థలం, రూ.25 వేల పెన్షన్ తదితర ప్రభుత్వ హామీలు నెరవేర్చాలని ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఉద్యమకారులు విజయవంతం చేయాలని కోరారు.

జిల్లా సదస్సు విజయవంతం చేయాలి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : 139 మేడే వేడుకల దృష్ట్యా నిర్వహించే జిల్లా సదస్సు జయప్రదం చేయాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న కోరారు. శనివారం భగత్ సింగ్ భవన్‌లో జిల్లా కమిటీ సమావేశం కిషన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందరభంగా మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కార్మికుల శ్రమను, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తోందన్నారు. కార్మిక వ్యతిరేక కోడ్ తీసుకొచ్చి వారి జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్ల రద్దు, లివింగ్ వేతనం, కనీస పెన్షన్ 9 వేల కోసం పోరాడాలన్నారు. ఈ నెల 28న పెన్షనర్ల సంఘ భవనంలో జరిగే జిల్లా సదస్సులో పాల్గొనాలని కోరారు. జిల్లా కార్యదర్శి కే. సాయన్న, లక్ష్మణ్, ఆనంద్, గణేష్, రమేష్, పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆదర్శనగర్‌లో గల ఆల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో శనివారం యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించినట్లు ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుంటాల జలపాతానికి రూఫ్ వే నిర్మిస్తాం

● అధికారులతో పరిశీలించిన మంత్రి సీతక్క

నేరడిగొండ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కుంటాల జలపాతానికి త్వరలోనే రూఫ్ వే నిర్మిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. శనివారం మండలంలోని కుంటాల జలపాతాన్ని టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడు తూ నిజాం కాలంలోనే కుంటాల జలపాతం వద్ద అప్పటి అధికారులు ఇక్కడ సేద తీరినట్టు ఆనవాళ్లు ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలోని ప్రజలు వర్షాకాలం కుంటాల జలపాతం వద్ద జాలువారే జలధారాలను తిలకించేందుకు వస్తుంటా రని, వారి సౌకర్యార్థం రూఫ్ వే నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నివేదికలను పంపించడం జరిగిందన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం రిసార్ట్ పనులను సైతం ప్రారభించామని, జూన్ కల్లా రిసార్ట్ అందుబాటులో వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణం దెబ్బతినకుండా కుం టాల జలపాతాన్ని అభివృద్ధి చేసి స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కలిగేలా చూస్తామన్నారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో కుంటాల జలపాతానికి ఒరిగిందేమీ లేదన్నారు. ఎలాంటి నిధులు సైతం మంజూరు చేయలేదని ఆరోపించారు. మంత్రి వెంట ఎమ్మెల్సీ దండే విట్టల్, కరీంనగర్ గ్రంథాలయ ఛైర్మన్ సత్తు, మల్లేష్, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి, టిపిసిసి సభ్యులు తుల అరున్ కుమార్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, జిల్లా నాయకురాలు ఆత్రం సుగుణ, తలమడుగు మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ఆడే వసంతరావు, నారాయణ సింగ్, తదితరులున్నారు.

● కుంటాల అభివృద్ధికి నిధులు కేటాయించండి : ఆడె

నేరడిగొండ: బోథ్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డితో కలిసి శనివారం మంత్రి సీతక్క కుంటాల జలపాతాన్ని సందర్శించారు. పర్యాటకుల సౌకర్యార్థం రూఫ్‌వే, కార్డిజెస్ నిర్మాణానికి, జలపాతం వద్ద మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని గజేందర్ కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

నేరడిగొండ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో నిర్వహించిన జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతుకు శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎకరాకు 15నుంచి 20 క్వింటాళ్ల కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు జొన్నలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఆదిలాబాద్ జిల్లాలో అధికంగా జొన్నలు పండిస్తున్న రైతుల కోసం ఎకరానికి 14 క్వింటాళ్ల కొంటునందుకు రైతుల తరుపున ధన్యావాదాలు తెలిపారు. రైతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే అమ్మాలని, కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇందులో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బొడ్డు గంగారెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పీఏసీఎస్ ఛైర్మన్ సాబ్లె కిషోర్ సింగ్, మహేందర్ రెడ్డి, బోథ్ ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావు, పండరీ, మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ నానక్ సింగ్, రమేష్, పెంట రమణ, దేవేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, గులాబ్, సుజీల్, పోతారెడ్డి, శంకర్, నారాయణ్ సింగ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

● సమావేశానికి హాజరు కాకుండా తిరిగి వెళ్లిన ఎమ్మెల్యే

బోథ్: మండలంలోని ధనూర్ గ్రామంలో శనివారం రూ.3 కోట్ల 59 లక్షలతో నిర్మించతలపెట్టిన బ్రిడ్జి నిర్మాణపు పనులను మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభించారు. అయితే అనంతరం గ్రామంలో ప్రజలతో కలిసి పాఠశాల ఆవరణలో సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. అయితే సమావేశంలో పాల్గొనకుండానే ఎమ్మెల్యే తన అనుచరులతో కలిసి వెళ్లిపోయారు. దీంతో అప్పటివరకు మంత్రి కాన్వాయ్ భారీ వాహనాలతో కనిపించగా తిరుగు ప్రయాణంలో కాన్వాయ్‌లో వాహనాలు తగ్గిపోయాయి. కాగా ఈ విషయమై ఎమ్మెల్యేను అడగగా ఆ సమావేశం పార్టీ సమావేశం మాదిరిగా ఉంది.. అక్కడికి వెళ్లి చేసేదేం లేదంటూ పేర్కొన్నారు.



కొలమలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ


మెడికల్ క్యాంపులో పాల్గొన్న ఆదివాసీ ప్రజలు

ఆదివాసీలు ఉన్నత చదువును అభ్యసించి..

ఉన్నత స్థానాలను అధిరోహించాలి

● ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

నార్నూర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గిరిజన ప్రాంత మారుమూల ఆదివాసీ తండాల్లో, గ్రామాల్లో ఉంటున్న ప్రజలకు వైద్య సేవలు అందించాలని సదుద్దేశంతో జిల్లా పోలీసు యంత్రాంగం తరపున గాదిగూడ మండలంలోని కొలమ గ్రామంలో జిల్లా వైద్యశాఖ సహకారంతో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. మొదటగా గ్రామ ప్రజలు జిల్లా ఎస్పీకి డప్పు వాయిద్యాలు నడుమ స్వాగ తం పలికి సభా స్థలికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువతకు చదువుపై ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ ఉన్నత చదువుకుని ఉన్నత స్థానాలకు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. చదువు వల్లే ఆదివాసులు అభివృద్ధి చెందుతారని తెలిపారు. ప్రతీ ఒక్క తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుకోవడానికి ప్రోత్సహించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. అదేవిధంగా గంజాయి సమాజంలో చీడ పురుగు అని, గంజాయి పండించడం వల్ల, వాడడం వల్ల సమాజ శ్రేయస్సుకు నష్టం కలుగుతుందని తెలిపారు. గంజాయి పండించడం వల్ల ప్రభుత్వం వల్ల వచ్చే లబ్ధిని కోల్పోతారని, గంజాయి కేసులు నమోదు చేపడతాయని తెలిపారు. అదేవిధంగా డయల్ 100ను ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఎలాంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100ను సంప్రదించాలని క్షణాల విధిలో జిల్లా పోలీసు యంత్రాంగం తమకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కరిస్తుందని తెలిపారు. జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. తదుపరి గ్రామంలో వైద్యశాఖ సహకారంతో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరంలో పాల్గొని ప్రారంభించి ఆదివాసీలకు అన్ని రకాలుగా వైద్య సదుపాయాలు చేరువలోకి తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గైనకాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, ఆప్తమాలజీకి సంబంధించిన డాక్టర్లు ఆదివాసీలకు వైద్య సేవలను అందించడం జరిగింది. వైద్య సేవలను తీసుకున్నానంతరం ప్రజలు ప్రతీ ఒక్కరికి సరైన మందులు ఉచితంగా అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, నార్నూర్ సీఐ రహీం భాష, వైద్య సిబ్బంది, గాదిగూడ ఎస్సై నాగనాథ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే టీబీ వ్యాధిని అరికట్టవచ్చు

ఉట్నూర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిని అరికట్టాలంటే వ్యాధి సోకి వారు తగిన జాగ్రత్తలు పాటించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైద్య శాఖ సిబ్బందితో కలిసి టీబీ ముక్త్ భారత్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షయ వ్యాధి ఓ అంటు వ్యాధి అని, ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తేనే ఈ వ్యాధిని అరికట్టవచ్చని అన్నారు. ప్రభుత్వాలు వ్యాధి సోకి వారికి వెయ్యి రూపాయలు, ఉచిత నిత్యవసర సరుకులు, గిరిజనులు ఉంటే ప్రయాణ ఖర్చుల నిమిత్తం రూ.750 అందిస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాధి నివారణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బానోత్ జైవంత్‌రావ్, టీబీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్, మాజీ సర్పంచ్ తిరుపతి, సిబ్బంది సుదర్శన్, అంబారావు, వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు కొడప రాధాబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో రన్ ఫర్ జీసస్ ర్యాలీ

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్‌లో క్రైస్తవుల ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ ర్యాలీని చేపట్టారు. ఈస్టర్ ఫెస్టివల్ సందర్భంగా చేపట్టిన ర్యాలీకి క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక హోలీ ఫ్యామిలీ క్యాథలిక్ చర్చి నుంచి ర్యాలీ ప్రారంభమైంది. క్రైస్తవులు జెండాలను పట్టుకొని యేసును కీర్తిస్తూ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఈ ర్యాలీ సాగింది. జీసస్ బోధన లలోని మానవీయతత్వాన్ని ప్రతీఒక్కరు అలవర్చుకోవాలన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ నూతన కార్యవర్గం

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీని అధినేత డాక్టర్ విశారదన్ మహరాజ్ సమక్షంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా అగ్గిమల్ల గణేష్, ప్రధాన కార్యదర్శిగా చిట్యాల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకటేష్, దర్శనాలు సుష్మా, కోశాధికారిగా మంజుషను ఎన్నుకున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికారమే లక్ష్యంగా పని చేయాలని నాయకులు తీర్మాణం చేశారు.

'బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి'

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్లో వక్ఫ్ బోర్డ్ చట్టం సాకుతో నిరసనల్లో భాగంగా హిందులపై దాడి చేసి, ముగ్గురిని చంపిన వారిని శిక్షించాలని విశ్వ హిందు పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించాలని దేశం మొత్తం వీహెచ్‌పీ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శనివారం ఆదిలాబాద్‌లో బైక్ ర్యాలీలో నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఇందులో బండారి సంతోష్, నారాయణ పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన మాజీ ఎంపీ

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మాజీ ఎంపీ సోయం బాపురావు నివాసానికి మంత్రి సీతక్క చేరుకొని కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా పలకరించారు. ముందుగా నివాసానికి చేరకున్న మంత్రి సీతక్కను మాజీ ఎంపీ సోయం బాపురావు శాలువాతో సత్కరించి సన్మానించారు. అనంతరం మాజీ ఎంపీ కుటుంబ సభ్యులతో కలిసి సీతక్క ముచ్చటించారు.

ఇంద్రవెల్లి అమరులకు సర్కార్ సలాం!

(1వ పేజీ తరువాయి...)

అమలుకు శ్రీకారం చుట్టింది. ఇంద్రవెల్లి అమరవీరుల 15 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ట్రైకార్ రుణాలు అందిస్తోంది. దీనికి గాను రూ.1.50 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటితో పాటు బాధిత కుటుంబాలకు ఇళ్ల పట్టాలు సైతం అందజేస్తోంది. ఈనెల 20న ఆదివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చేతుల మీదుగా రుణాలతో పాటు ఇళ్ల పట్టాలను అందజేయనున్నారు. ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్ గ్రామంలో బాధిత కుటుంబాలకు కేటాయించిన ఇందిరమ్మ కాలనీలో విద్యుత్తు సౌకర్యంతో పాటు తాగునీరు, ఇతర మౌలిక వసతుల ను కల్పిస్తున్నారు. అలాగే ఏన్నో ఏళ్లుగా పౌర హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తూ వస్తున్న స్మృతి వనం నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేసి పనులను చేపడుతున్నారు. ఇప్పటికే ప్రహరీతో పాటు మీటింగ్ హాల్ పనులు పూర్తయ్యాయి. మిగితా పనులు కొనసాగుతున్నాయి. అమరవీరుల స్తూపం వద్ద అభివృద్ధి పనులను చేపట్టడంతో నూతన శోభను సంతరించుకుంది. అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా.. ఇతర జిల్లాల నుంచి ఆదివాసీ గిరిజనులు భారీగా తరలిరానున్నారు.

గిరిజన గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతాలు

ఉట్నూర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పోషణ పక్షోత్సవం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గిరిజన గర్భిణులకు సీమంతం కార్యక్రమాలను అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు నిర్వహిస్తున్నారు. ఉట్నూర్ సమగ్ర బాలాభ్యుదయ పథకం ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని సుద్దగూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో గిరిజన గర్భిణీ సుజాతకు సీమంతం కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ మంజులత, అంగన్‌వాడీ టీచర్ బెక్కం ప్రమిళ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం భుజించాలని సూచించారు. తాజా ఆకు కూరలు, కూరగాయలు, పప్పు దినుసులు భుజించాలని, తద్వారా కడుపులో ఉన్న శిశువుతో పాటు తల్లి ఆరోగ్యంగా ఉంటారన్నారు.


చలో వరంగల్ పోస్టర్ల ఆవిష్కరణ

బేల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని మండల మండల అధ్యక్షుడు కళ్లెం ప్రమోద్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో కలిసి చలో వరంగల్' పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న బీఆర్ఎస్ పార్టీ 25 ఏళ్లు పూర్తి చేస్తున్న సందర్భంగా పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ నాయకత్వంలో వరంగల్‌లో రజతోత్సవం మహాసభను విజయవంతం చేయడం కోసం ఈ రోజు పోస్టరను విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి మండలం నుంచి వివిధ గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రతీ గ్రామం నుంచి వందలాది జనాలు రావడానికి సిద్ధంగా ఉన్నారని మండలం నుంచి దాదాపుగా రెండు వేల ప్రజలు వరంగల్ మహాసభకు తరలి వస్తారని పేర్కొన్నారు.

కాలిబూడిదైన 50 క్వింటాళ్ల జొన్నలు

బోథ్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దన్నూర్ గ్రామానికి చెందిన మార సుధాకర్‌రెడ్డి అనే రైతుకు చెందిన జొన్న పంట శనివారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో దాదాపు 50 క్వింటాళ్ల మేరకు కాలి బూడిదైయ్యింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మధ్యాహ్నం పంటచేను పక్కనే ఉన్న ట్రాన్స్‌పార్మర్ విద్యుత్ తీగలు రాపిడికి గురయ్యాయి. దీంతో నిప్పు రవ్వలు చెలరేగాయని బాధిత రైతు తెలిపారు. అంతలోనే నిప్పు రవ్వలు చెలరేగి జొన్నలపై పడటంతో పంట పూర్తిగా దగ్ధమైంది. ఫలితంగా రైతుకు దాదాపు లక్షన్నర రూపాయల వరకు నష్టం సంభవించింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధత రైతు కోరుతున్నాడు.


నేడు మాజీ మంత్రి గడ్డెన్న 21వ వర్ధంతి



భైంసా,ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ రాజకీయ చిత్రంపై చెరగని ముద్ర వేసుకున్న స్వర్గీయ మాజీ మంత్రి వర్యులు గడ్డెన్న కాకా 21వ వర్ధంతి ఆదివారం జరుగనుంది. రాష్ట్ర శాసనసభ చరిత్రలో సీనియర్ సభ్యునిగా పేరుగడించిన గడ్డెన్న ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా 6 పర్యాయాలు ఎన్నికై రికార్డు సృష్టించారు. ఒక మారు బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా కూడ బాధ్యతలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా సుదీర్ఘ కాలంగానున్న ఆయన తన వ్యవహార శైలితో, ప్రవర్తన తీరుతో, పాలన దక్షతతో ప్రేమానురాగాలు,ఆప్యాయతలను పంచుతూ అందరివాడు అని అనిపించుకున్నాడు. నియోజక వర్గ వాసులతో పాటు రాష్ట్రంలోని అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులచే 'కాకా' అని పిలిపించుకున్న ఆయన మరిణించి ఆదివారం నాటికి 21 సంవత్సరాల కాలం పూర్తవుతోంది.అయినప్పటికి నేటికి కూడ అందరి నోటిలో గడ్డెన్న కాకా పేరు నానుతూనే ఉంది. నియోజకవర్గ పరిధిలో పర్యటనకు వచ్చే రాష్ట్ర ముఖ్యమంత్రితో సహా మంత్రులు, రాజకీయ పార్టీల ప్రధాన నాయకులు, ప్రతిపక్ష నాయకులు నేటికి కూడ గడ్డెన్న పేరును జ్ఞప్తికి తెచ్చుకొని ఆయన పనితీరును గూర్చి చెబుతూ మంచితనానికి మరోపేరు కాకాయేనని పేర్కొంటుంటారు. తమకు ఆయనతో గల ఆత్మీయ సంబంధాలను సభాముఖంగానే వెలిబుచ్చుతారంటే ఆయన ప్రాధాన్యత ఎంతటిదో చెప్పకుండానే తెలుస్తుంది. గడ్డెన్న సేవలను గుర్తించిన స్వర్గీయ ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆయన పేరు చిరస్థాయిగా గుర్తిండిపోయేలా సుద్దవాగు ప్రాజెక్టు పేరును గడ్డెన్న వాగు ప్రాజెక్టుగా పేరు మార్చారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

● ముందే వెళ్లిన ఉపాధ్యాయుడిని మందలించిన డీఈవో


పార్‌పెల్లిలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఈవో రామారావు

లక్ష్మణచాంద, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు శనివారం తనిఖీ చేశారు. ధర్మారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి, పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఎస్ఏ-2 పరీక్ష పేపర్లను నిర్ణయించిన గడువులోగా మూల్యాంకనం చేసి, ఏప్రిల్ 23న పాఠశాలలో నిర్వహించే తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డ్ ఇవ్వాలని సూచించారు. అలాగే పాఠశాల అభివృద్ధికి పలు సూచనలు చేశారు. అనంతరం పార్‌పెల్లిలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించారు. సిబ్బంది సమావేశం నిర్వహించి పాఠశాల అభివృద్ధికి చేయవలసిన కార్యక్రమాలు తెలియజేశారు. అదేవిధంగా ప్రాథమిక నియమాలు పాటించకుండా నిర్లక్ష్యంగా ఉన్న ప్రధానోపాధ్యాయులను మందలిస్తూ, పలు సూచనలు చేశారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ముగింపు సమయం కంటే ముందే వెళ్లటం పట్ల మందలించారు. సమయపాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూ భారతిపై అవగాహన సదస్సు

ముథోల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై మండలంలోని ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు శనివారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. మండలంలోని బోరిగాం, విట్టోలి, ముద్గల్, రాంటెక్ గ్రామాల్లో రెవెన్యూ అధికారులతో రైతులతో కలిసి భూభారతి చట్టంపై క్షుప్తంగా అవగాహన కల్పించారు.

మారుమూల గ్రామాలకు బస్సులు నడపండి : నిర్మల్ ఎమ్మెల్యే

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మండలంలోని బస్సు సౌకర్యం లేని మారుమూల గ్రామాలకు బస్సులు నడిపించేందుకు చర్య తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి నిర్మల్ డిపో మేనేజర్ పండరిని ఆదేశించారు. శనివారం డీఎం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. సారంగాపూర్ మండలంలోని జౌలి, లక్ష్మణచాంద మండలం మాచాపూర్, మామడ మండలంలోని మేడిపల్లి, తాండ్ర గ్రామాలకు బస్సులు నడిపించాలన్నారు. రోడ్డు సర్వే చేసి ప్రయాణికుల రద్దీకి అనుకూలంగా బస్సులు నడిపేందుకు చర్య తీసుకుంటామని డీఎం అన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ అందజేసిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోత) : సోన్ మండలం జాఫ్రాపూర్ గ్రామానికిచెందిన మాలెపు నర్సయ్యకు చికిత్స నిమిత్తం 2.25 విలువ గల ఎల్‌వోసీ కాపీని బాధిత కుటుంబ సభ్యులకు శనివారం ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి నివాస గృహంలో అందజేశారు. ఎల్‌వోసీ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు హరీష్‌రెడ్డి, జమాల్, తదితరులు పాల్గొన్నారు.


ఎల్‌వోసీ కాపీని కుటుంబ సభ్యులకు అందజేస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

ఇందిరమ్మ లబ్ధిదారుల

ఎంపిక పారదర్శకంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ డిప్యూటీ సీఈవో శంకర్

దిలావర్‌పూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని జడ్పీ డిప్యూటీ సీఈవో, మండల ప్రత్యేక అధికారి శంకర్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇందిరమ్మ కమిటీల సభ్యులు, పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీలు చాలా కీలకమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దగ్గరకు వెళ్లి ఇందిరమ్మ ఇళ్లు పొందేందుకు అర్హులా కారా అనేది తేల్చాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇళ్లు లేని నిరుపేదలను, వితంతువులను, ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ఈ నెల 21 తేదీలోపు లబ్ధిదారుల జాబితా ఇవ్వాలని సూచించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇచ్చిన జాబితాను అధికార బృందం మరొకసారి పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేస్తుందన్నారు. ఎంపికైన లబ్ధిదారుల జాబితాను మే 2 న గ్రామ పంచాయతీలో ప్రదర్శిస్తామన్నారు. నిజమైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. అందుకు అనుగుణంగానే ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో అరుణారాణి, ఎంపీవో గోవర్ధన్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులకు అవగాహన

ముథోల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని మండల అభివృద్ధి కార్యాలయంలో గల సమావేశ మందిరంలో శనివారం ఎంపీడీవో శివ కుమార్, తహసీల్దార్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులకు అగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని, పూర్తి పారదర్శకంగా ఉండాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరగా నిర్మాణాలు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. గ్రామస్థాయిలో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులతో సమన్వయంతో పని చేయాలన్నారు

ఆన్‌లైన్ నుంచి తొలగించిన

ఇంటి నెంబర్లను తిరిగి పునరుద్ధరించండి

● మున్సిపల్ కమిషనర్‌కు గంగపుత్ర కాలనీ వాసుల విన్నపం

ఖానాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో గల గంగపుత్ర కాలనీలోని ఆన్‌లైన్ నుండి తొలగించిన ఇంటి నెంబర్లను వెంటనే పునరుద్ధరించాలని ఆ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ... గతంలో తమకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలకు ఖానాపూర్ మున్సిపల్ ఏర్పాటుకు ముందు ఇంటినెంబర్లు ఉన్నాయన్నారు. ఖానాపూర్ గ్రామ పంచాయతీ నుండి మున్సిపాలిటీగా అవతరించిన నాటి నుండి తమ ఇళ్లకు ఉన్న నెంబర్లను ఆన్‌లైన్ నుంచి తొలగించారన్నారు. దీంతో ప్రస్తుతం మా ఇంటి స్థలాలు రిజిస్ట్రేషన్ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని రిజిస్ట్రేషన్ చేయాలని కోరితే లింకు డాక్యుమెంట్ తీసుకురావాలని అధికారులు చెబుతున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలకు లింకు డాక్యుమెంట్ తాము ఎక్కడ నుంచి తేవాలని వారు నిస్సహాయత వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మున్సిపల్ ఏర్పడక ముందు మున్సిపల్ ఏర్పడిన తర్వాత ఇంటి నెంబర్ పైన తీసుకున్న ఇంటి పన్ను రసీదుల ఆధారంగా ఆ ఇళ్ల నెంబర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గడ్డమీది రవి, గడ్డి సాయిరాం, కాశవేణి ప్రశాంత్, కొండవేణి రాము, గడ్డమీది ప్రవీణ్, కాశవేణి ప్రణయ్, గడ్డమీది రాజేశ్వర్, మెంగు ప్రకాష్, గట్టొళ్ళ ప్రతాప్, గడ్డమీది ప్రసాద్, తదితరులున్నారు.

పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

● బీజేపీ ఖానాపూర్ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్

ఖానాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త సైనికుడు అనే కృషిచేయాలని ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్ అన్నారు. శనివారం మం డలంలోని మస్కాపూర్ గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షులు పుప్పాల ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన భారతీయ జనతా పార్టీ సంఘటన సంరచన పర్వం కార్యక్రమానికి మహేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలోని బూత్ కమిటీలు, మండల కమిటీలు పార్టీ బలోపేతం దిశగా అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ పని చేసే ప్రతి కార్యకర్తకి సమ న్యాయంగా పదవి బాధ్యతలను అప్పగిస్తారన్నారు. బీజేపీలో పార్టీ బలోపేతానికి కృషి చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు నల్ల రవీందర్‌రెడ్డి, గడ్డం రవీందర్, పిట్టల భూమన్న, కంతి లింబాద్రి, ఇనుముల స్వామీ, బట్టు వరుణ్, పెట్టెం శేఖర్ తదితరులున్నారు.


స్వరూపిణి నృత్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో

గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సక్సెస్ మీట్


గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన చిన్నారులతో అదనపు ఎస్పీ

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : స్వరూపిణి నృత్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సక్సెస్ మీట్- 2025లోను శుక్రవారం రాత్రి పట్టణంలోని హోటల్ మానస ఇన్‌లో నిర్వహించినట్లు నవ్య వినయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ... నిర్మల్ చిన్నారులు 54 మంది గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. నాట్య గురువు నవ్య వినయ్ మాట్లాడుతూ... 2023 డిసెంబరు 24న హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించిన భారత్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి మహా బృందం నాట్యంలో పాల్గొన్న చిన్నారులకు గిన్నిస్ బుక్‌లో చోటు లభించింది. వీరికి 18 నెలల తర్వాత సర్టిఫికెట్లు, మెడల్ రావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లేబర్ ఆఫీసర్ ముత్యంరెడ్డి, మానసిక వైద్య నిపుణులు అల్లాడి సురేష్, ఉమెన్ రైట్స్ ఛైర్‌పర్సన్ అనీషా, తదితరులు పాల్గొన్నారు.

బేస్ బాల్ నేషనల్ మీట్‌కు విన్నర్స్ విద్యార్థుల ఎంపిక



నేషనల్ మీట్‌కు ఎంపికైన విద్యార్థులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21 నుండి 27 వరకు న్యూ ఢిల్లీలో జరిగే బేస్ బాల్ నేషనల్ మీట్‌లో పాల్గొనేందుకు నిర్మల్ పట్టణం విన్నర్స్ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల యాజమాన్యం శనివారం విద్యార్థులను అభినందించింది. మనోజ్ఞ, నిహిత్, మన్విత , శ్రీహరి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కరస్పాండెంట్ దాసరి రాజు, ఛైర్మన్ కొమ్ము ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు దినేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు సహదేవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు సాధించిన విజయంతో ఇతర విద్యార్థులకు స్ఫూర్తి కలుగుతుందన్నారు. జాతీయ పోటీల్లో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులతో సమావేశం

లోకేశ్వరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోత) : మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఎంపీడీవో అధ్యక్షతన ఇందిరమ్మ ఇళ్ల కమిటీతో సమావేశం ఏర్పాటు చే యడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నమూనా మేరకు ఇందిరమ్మ నిర్మాణాలు జరుగుతున్నాయని ఎంపీడీవో రమేష్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులకు ఆయన పలు సూచనలు చేశారు.



ఆదిలాబాద్‌లో ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన ప్రధాన రోడ్లు

భానుడి భగ భగలు

• ఆదిలాబాద్‌లో అత్యధికంగా 42.2 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదు

ఆదిలాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): భానుడి భగ భగలకు పగటి ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. శనివారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 41.3 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 28.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే అత్యధికంగా ఆదిలాబాద్ అర్బన్‌లో 42.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా తాంసీలో 42.1 డిగ్రీలు, మావలలో 42.0, బేలలో 41.9 ఆదిలాబాద్ రూరల్‌లో 41.8 సిరికొండలో 41.5 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా యి. దాదాపుగా జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో తీవ్రమైన ఎండతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎండల తీవ్రతతో ఉదయం సాయంత్రం వేళల్లోనే పనులు ముగించుకుంటున్న ప్రజలు మధ్యాహ్నం సమయంలో విశ్రాంతి తీసుకుంటూ ఇండ్లకే పరిమితమవుతు న్నారు. జిల్లాపై మరికొన్ని రోజులపాటు వడగాలుల ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ నిపుణు లు పేర్కొంటున్నారు.



19 ఏళ్ల తర్వాత కోనేరు పునర్నిర్మాణం



గతంలో పూడ్చి వేసిన కోనేరు (ఫైల్)



జేసీబీ సహాయంతో కోనేరును పునఃప్రారంభిస్తున్న దృశ్యం

మామడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్కల్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయ సమీపంలోని కోనేరు గత 19 సంవత్సరాల క్రితం పూడ్చి వేశారు. కాగా అదే కోనేరు పునర్నినిర్మాణం పనులు శనివారం ప్రారంభించడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కోనేరు పునః నిర్మాణంతో గ్రామానికి మంచి జరుగుతుందని తాము సైతం అంటూ గ్రామస్థులు డబ్బు, శ్రమ రూపంలో పాల్గొనేందుకు ముందుకు వస్తున్నారు.

జిల్లా రక్షణలో ప్రత్యేక శివంగిలు

• రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా నిర్మల్ జిల్లాలో టీం శివంగి ఏర్పాటు
• రాష్ట్రమంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభం • నిర్మల్ జిల్లా స్ఫూర్తితో టీం శివంగి రాష్ట్రమంతా విస్తరిస్తే బాగుంటుంది
• ఎస్పీ జానకి షర్మిల వినూత్న ఆలోచనలు అభినందనీయం: మంత్రి సీతక్క



శివంగి టీంతో జిల్లా డాక్టర్ జానకి షర్మిల కమాండెట్లతో ఏర్పాటు చేసిన శివంగి టీంను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క



నిర్మల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): చంద్ర మండలానికి సైతం అలవోకగా వెళ్లి వస్తున్న మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల స్ఫూర్తితో నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థలో పురుషులతో పాటు తాము కూడా ప్రతీ విభాగంలో విజయవంతంగా విధులు నిర్వహిస్తామని మహిళలు ఎలుగెత్తి చాటేలా ఎస్పీ జానకి షర్మిల 'టీం శివంగి' పేరుతో ప్రత్యేక మహిళా పోలీస్ కమాండోలా బృందాన్ని సిద్ధం చేశారు. ఇదివరకే జిల్లాలో నారీశక్తి పేరిట మహిళా పోలీసులను అన్ని విభాగాలలో విధులు నిర్వహించేలా చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిన ఎస్పీ జానకి షర్మిల మహిళా పోలీసులను మరింత ముందుకు తీసుకెళ్లేలా మరో ముందడుగు వేశారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులను ఎంపిక చేసుకొని 45 రోజుల పాటు కఠోర శిక్షణను అందించారు. ఈ కఠోర శిక్షణను పూర్తి చేసుకున్న టీం శివాంగి బృందం శనివారం నుంచి విధుల్లోకి వచ్చారు. రాష్ట్ర మంత్రి సీతక్క చేతుల మీదుగా శనివారం నిర్మల్ జిల్లాలో టీం శివంగి మహిళా పోలీస్ కమాండో విభాగాన్ని ప్రారంభించారు.

45 రోజుల ప్రత్యేక శిక్షణ

నేటి పోటీ ప్రపంచంలో పురుషులతో పాటు అన్ని రంగాల్లో తాము కూడా సమానమని నిరూపిస్తున్న నారీమణులు రక్షణ విభాగంలో సైతం తమ మార్కును వేసేలా నిర్మల్ జిల్లా ఎస్పీ వినూత్న ఆలోచన చేశారు. ఆ ఆలోచన నుండి పుట్టిన ఆదర్శ కార్యక్రమమే 'టీం శివంగి' దేశంలోని త్రివిధ దళాలైనా ఆర్మీలో స్పెషల్ కమాండో ఫోర్స్, నావిలో మార్కోస్ కమాండోస్, స్పెషల్ కమాండోస్‌గా ఎన్ఎస్‌జీ, ఎస్పీజీ, తెలంగాణ రాష్ట్రంలోని గ్రేహౌండ్స్ వలే ఈ టీం శివంగి పనిచేస్తుందని ఎస్పీ చెబుతున్నారు. టీం శివంగిలో పనిచేసే మహిళా కమాండోలను తెలంగాణ పోలీసు శాఖలోని అత్యాధునిక ఆయుధాలను ఉపయోగించేలా కఠోర శిక్షణతో తీర్చిదిద్దారు. ఈ శిక్షణలో 45 రోజుల పాటు శారీరక ధృఢత్వం కోసం రన్నింగ్ రేసులు, వెర్టికల్ రోప్ క్లైంబింగ్, మనగడ పద్ధతులు, యుద్ధ తంత్ర కళలో పోరాట నైపుణ్యాలు, పేలుడు పదార్థాల శిక్షణ, ఆయుధాల ఉపయోగం, టెక్నాలజీతో కూడిన ఆయుధాలను ఫైరింగ్ చేసే విధానం, ఓపెన్ హ్యాండ్లింగ్, ఫీల్డ్ సిగ్నల్స్ మ్యాప్ రీడింగ్, మ్యాప్ లేకుండా నావిగేట్ చేయడం, ఆకస్మిక వ్యూహాలు, లక్ష సాధనలు, శత్రువుల కదలికలు, అడవి సంకేతాలను చదవడం, నిఘా పద్ధతులు, ఆకస్మిక దాడి, ఎదురుదాడి, కసరత్తులు, రాజ్య స్థావరాలపై దాడులు చేయడం లాంటి అంశాలపై నిష్ణాతులైన నిపుణు లతో ప్రత్యేక శిక్షణను పూర్తి చేయించారు.

టీం శివంగికి మంత్రి సీతక్క అభినందన

నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల వినూత్న ఆలోచనతో పుట్టిన 'టీం శివంగి కార్యక్రమాన్ని శనివారం నిర్మల్‌లో రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ప్రారంభించారు. టీం శివంగి ఏర్పాటు పట్ల మంత్రి మంత్రముగ్ధులయ్యారు. ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జిల్లా ఎస్పీ జానకి షర్మిలను అభినందించారు. నిర్మల్ జిల్లా స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా సైతం అన్ని జిల్లాలలో టీం శివాంగి ఏర్పాటు చేస్తే బాగుంటుందని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ చేస్తున్న కార్యక్రమాలను ఆమె వేదికపైనే అభినందించారు. ఇటీవల మామడ అడవుల్లో తునికాకు సేకరణకు వెళ్లి తప్పిపోయిన నలుగురు మహిళలను కాపాడిన విధానాన్ని మంత్రి సీతక్క కొనియాడారు. మహిళా శక్తిని ప్రపంచానికి చాటేలా ఎస్పీ చేపడుతున్న వినూత్న కార్యక్రమాలన్నీ ఆదర్శప్రాయంగా ఉన్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు.

ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలకు నేడు ఆర్థిక చేయూత

ఉట్నూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి మారణకాండ జరిగిన నాలుగు దశాబ్దాలు కావస్తుండగా ఎట్టకేలకే ప్రజా ప్రభుత్వం ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించడానికి సిద్ధం అయింది. 1981 ఏప్రిల్ 20న జరిగిన ఇంద్రవెల్లి కాల్పుల అనంతరం ఇంద్రవెల్లి అమరవీరుల త్యాగాలను గుర్తించడానికి గిరిజన రైతు కూలీల సంఘం ఆధ్వర్యంలో ఇంద్రవెల్లిలో అమరవీరుల స్థూపం నిర్మించారు. నాటి నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యేవరకు నిషేధాల మధ్య ఇంద్రవెల్లి అమరులకు గిరిజనులు నివాళులు అర్పిస్తూ వచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక అప్పటి ముఖ్యమంత్రి చంద్ర శేఖరరావు ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి అమరులకు స్వేచ్ఛగా నివాళులు అర్పించుకోవడానికి గిరిజనులకు అవకాశం కల్పించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేతపట్టిన ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తుత ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం సమీపంలో కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించి ఎన్నికల ఘంటారావాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారు. జిల్లా గిరిజనులకు ఇచ్చిన హామీ మేరకు ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం వద్ద కోటి రూపాయలు మంజూరు చేస్తూ స్మృతి వనం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 20న నిర్వహించనున్న ఇంద్రవెల్లి అమరవీరుల నివాళుల కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని భావించింది. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ధనసరి అనసూయ సీతక్కతో పా టు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సబ్ కలెక్టర్లు హాజరుకానున్నారు.

15 మందికి ఆర్థిక చేయూత

ఇంద్రవెల్లి కాల్పుల్లో అమరులైన ఇంద్రవెల్లి సిరికొండ మండలాలకు చెందిన 15 మంది అమరవీరుల కుటుంబాలకు ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ద్వారా ఒక్కొక్కరికి 10లక్షల వంతున 15 మందికి కోటి యాభై లక్షల తో ఆర్థిక చేయూత పథకాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఐటీడీఏ అధికారులు కృషి చేస్తున్నారు. ఆర్థిక సహాయ పథకం ద్వారా 60 శాతం సబ్సిడీ కాగా 40 శాతం బ్యాంకు రుణాల ద్వారా ఒక్కొక్కరికి 10 లక్షలతో పథకం అమలు చేయనున్నారు. కొందరికి కిరాణా దుకాణాలు, మరికొందరికి ట్రాక్టర్, బోలెరో వాహనం, మొబైల్ షాప్ ఏర్పాటు, బోర్వెల్ పెన్సింగ్, లాంటి పథకాల అమలుకు మండాడి దేవరావు, కోట్నాక్‌బండు, మండాడి ఇస్రు, కోట్నాక్ రామ్‌శావ్, సెడ్‌మాకి లక్ష్మి, తొడసం హనుమంతు, పెందూరు సీతాబాయి, పెందూరు లచ్చు, పెందూరు గోపత్‌రావు, పెందూరు ఆనంద్‌రావు, అంకుష్, కోవారాము, హీరాకొముర జంగు, అర్కనాగోరావు, సిడాం రూపాబాయిలకు ఐటీడీఏ ద్వారా పథకాలు అందించే ఏర్పాట్లు పూర్తి చేశారు.



ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం

చెట్ల కొమ్మలను తొలగించిన విద్యుత్ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఉట్నూర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెట్ల కొమ్మలు తొలగించిన దృశ్యం

ఉట్నూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్‌లోకి చెట్ల కొమ్మలు - పట్టించుకోని విద్యుత్ అధికారులు' శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు విద్యుత్ అధికారులు స్పందిం చారు. అంబేద్కర్ సమీపం నుంచి వేణునగర్ వెళ్లే దారిలో ఉన్న ట్రాన్స్‌పార్మర్‌లోకి చొచ్చుకు వెళ్లిన చెట్ల కొమ్మలను తొలగించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



ఉట్నూర్‌లో తాటి ముంజలను విక్రయిస్తున్న దృశ్యం

ఉపాధినిస్తున్న తాటి ముంజల వ్యాపారం

ఉట్నూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో నెలరోజుల పాటు ల భించే తాటి ముంజలను ప్రజలు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు. ఉట్నూర్ ప్రాంతంలో తాటి చెట్లు ఎక్కువగా లేకపోవడంతో ఇది అదునుగా ఉమ్మడి జిల్లాలోని కడెం మండలం నచ్చన ఎల్లాపూర్‌కు చెందిన దొంగరి పోశన్నతో పాటు అదే గ్రామానికి చెందిన భార్యాభర్తలు కూడా ఉట్నూర్‌కు ఆటో ద్వారా తీసుకు వచ్చి బజార్‌లో ఎక్కడ నీడ లభిస్తే అక్కడ కూర్చుండి 100కు డజన్ తాటి ముంజలు విక్రయిస్తున్నారు. మండుతున్న ఎండల సమయంలో తాటి ముంజలను తినడం ద్వారా కూడా కాసింత ఉపశమనం లభిస్తుందని భావిస్తున్న ప్రజలు అమిత ఆనందంగా ఖర్చుకు భయపడకుండా వేసవి కాలంలో లభించే తాటి ముంజలను ఇష్టంగా కొనుగోలు చేసుకుని తింటున్నారు. నెల రోజుల పాటు తాటి ముంజల విక్రయం ద్వారా తమకు ఉపాధి లభిస్తుందని పోషన్న తెలిపారు. చెట్టు వద్ద తమకు రూ.80కు డజన్ విక్రయిస్తే తాము రూ.20 లాభంతో తాటి ముంజలు విక్రయిస్తున్నాయని వివరించారు. ఏది ఏమైనా కేవలం నెల రోజుల పాటు ప్రజలకు లభించి తాటి ముంజలను ప్రజలు అమిత ఆ నందంగా తింటున్నారు.



ఉట్నూర్‌లో తాటి ముంజలు విక్రయిస్తున్న దృశ్యం



తాటి ముంజలు

ఉపాధి హామీ.. సౌకర్యాల లేమి

● ఎండలకు ఇబ్బందులు పడుతున్న కూలీలు

కుభీర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఉదయం ఎనిమిది గంటలకే ఎండ తీవ్ర పెరిగి పోతోంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేవు. దీంతో రైతులు, కూలీలు ఉపాధిహామి పనులకు వెలుతున్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు నివారించేందుకు మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించింది. దీంతో తమ గ్రామాల్లోనే ప్రజలకు ఉపాధి లభిస్తోంది. పనిచేసే చోట నీడ సౌకర్యం లేక పోవడంతో వడదెబ్బ, అలసట ఏర్పడి కూలీలు అనారోగ్యానికి గురవుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఎలాంటి సౌకర్యలు కల్పించడం లేదు. గతంలో టెంట్‌లు, గుడారాలు ఏర్పాటు చేసేవారు. గాయాలైతే ప్రథమ చికిత్సకు వైద్య సామాగ్రి అందుబాటులో ఉండేంది. ప్రస్తుతం వాటి జాడ లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఉపాధి పని చేస్తున్న కూలీలు

● ఎండలతో పొంచి ఉన్న ప్రమాదం

మండలంలోని 42 గ్రామ పంచాయతీలకు గాను 38జీపీల్లో ఉపాధి హామి పనులు సాగుతున్నాయి. వేసవి కాలంలో ప్రధానంగా వ్యవసాయ అనుబంధ పనులను మంజూరు చేశారు. మండలంలో 11వేల 360 జాబు కార్డులున్నాయి. 202-25 ఆర్థిక సంవత్సరంలో సుమారు 686 మంది కుటుంబాలు వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకున్నారు. వేసవి దృష్ట్యా పంట చేన్లు, చెరువులు, కుంటలు, వ్యవసాయ అంతర్గత రహదారుల్లో పనులు చేపడుతున్నారు. ఏప్రిల్ 15న మండలంలో 5336 మంది కూలీలు పనులకు మచ్చారు. ఇలా రోజుకు సగటున 5 వేల 2వంల మందికి పైగానే కూలీలు హాజరవుతున్నారని ఈజీఎస్ అధికారులు తెలుపుతున్నారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ఎండలు ప్రస్తుతం 38డిగ్రీలు దాటుతున్నాయి. ఎప్రిల్, మే నెలలో ఎండవేడిమి మరింత పెరిగే అవకాశముందని పలువురు తెలుపుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నష్టం జరగకముందే కూలీలకు సౌకార్యలు కల్పించాలని కోరుతున్నారు.



కుభీర్‌లో చెట్ల కింద సేద తీరుతున్న ఉపాధి హామీ కూలీలు

● ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం
హరిలాల్ ఏపీవో కుభీర్



కూలీలు పని చేసే చోట నీటి సౌకర్యం కల్పించాలని గ్రామ పంచాయతీలకు ఆదేశించాము. నీటి వసతి కల్పించేందుకు ఒక్కరికి రూపాయి చొప్పు చెల్లిస్తున్నాము. టెంట్‌లు , గుడారాలు, ఏర్పాటుకు జిల్లా అధికారులతో విషయాన్ని వివరించి వారి ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాము. ఎండ దృష్ట్యా కూలీలు ఉదయమే పనులకు వెళ్లి మద్యాహ్నం వరకు ఇంటికి చేరుకోవాలని సూచిస్తున్నాము.

నిరుపయోగంగా రైతు విశ్రాంతి భవనం

● లక్షల వ్యయం.. అయినా నిష్ప్రయోజనమే!



భైంసా, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ అధికార, పాలక వర్గాలు అవలంబిస్తున్న అలసత్వ విధానాలకు, కిందిస్థాయి సిబ్బంది బాధ్యతారాహిత్య చర్యలు తోడవ్వడం మూలంగా లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రైతు విశ్రాంతి భవనం నిరుపయోగంగా మారింది. మార్కెట్‌కు వ్యవసాయో త్పత్తులను తీసుకొచ్చి విక్రయించుకునే రైతుల సౌకర్యార్థం నిర్మించిన రైతు విశ్రాంతి భవనం ఆలంకార ప్రాయంగా మిగిలిపోయింది. దీంతో రైతులు మార్కెట్‌లోని దుకాణాల వద్దే అష్టకష్టాలు పడుతూ బస చేయాల్సి వస్తోంది.

భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీలోని కాటన్‌యార్డులో రూ. 15 లక్షల వ్యయంతో 1997 సంవత్సరములో సకల సౌకర్యాలు ,వసతులతో కూడిన రైతు విశ్రాంతి భవనం నిర్మించారు. అక్కడ రైతుల కోసం గదులు, ఫ్యాన్లు, మంచాలు, పరుపులు, ఇతర సదుపాయాలను కల్పించారు. మార్కెట్‌లో క్రయ, విక్రయాల కోసం వచ్చే రైతులు ఏవిధమైన అద్దె చెల్లించనవసరం లేకుండా ఈ విశ్రాంతి భవనంలో బస చేయవచ్చు. మార్కెట్ యార్డులో పత్తితో పాటు పలు దిగుబడులను విక్రయించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి రైతులు ఇక్కడికి చేరుకుంటారు. గ్రేయిన్ మార్కెట్ యార్డులో వ్యవసాయోత్పత్తుల తూకాలు వేసే ప్రక్రియ అర్ధరాత్రి వేళ వరకు జరుగుతు ఉంటుంది. విక్రయాలకు నిర్వహించేందుకు వచ్చే రైతులు విశ్రాంతి భవనంలో రాత్రి పూట సేద తీరవచ్చు. అయితే ఆ భవనానికి ఎప్పుడూ తాళాలు వేసి ఉంచ డంతో రైతులు మార్కెట్లోని దుకాణాల వద్దే విశ్రాంతి తీసుకోవాల్సిన దుస్థితి నెలకొని ఉంది. రాత్రిళ్ల దోమలతో తమకు కంటి మీద కునుకు లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాల్లో స్థలభావంతో తాము పడుకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మార్కెట్ కమిటీ అధికారులు రైతు విశ్రాంతి భవనాన్ని వినియోగంలోకి తీసుకవచ్చి తమ ఇబ్బందులను తొలగించేం దుకు చర్యలు చేపట్టాలని పలువురు రైతులు ముక్తకంఠంతో కోరుతు న్నారు.

వసతులు, సౌకర్యాలు కల్పించాలి..

● డా.కిరణ్ కోమ్రేవార్ , సమన్వయ కమిటీ ప్రతినిధి, బీఆర్ఎస్, ముథోల్ నియోజక వర్గం



వ్యవసాయోత్పత్తుల విక్రయాల కోసం గాను మార్కెట్‌కు వచ్చే రైతులకు మార్కెటింగ్ అధికార,పాలక వర్గాలు అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పించాలి. ప్రస్తుతం వసతుల లేమి, సౌకర్యాలు కరువుతో రైతులు అవస్థలు పడుతున్నారు. కనీసం తాగు నీటి వసతి కల్పించడంతో అధికార యంత్రాంగం విఫలమవుతోంది.

అన్ని రకాల సేవలు విస్తృతపరుస్తాం

● షిండే ఆనంద్‌రావ్ పాటిల్, చైర్మెన్, మార్కెట్ కమిటీ, భైంసా



క్రయ, విక్రయాల నిమిత్తం మార్కెట్ కమిటీకి వచ్చే రైతులకు అన్ని రకాల సేవలు అందించేందుకు గాను ప్ర ణాళిక బద్ధమైన చర్యలు తీసుకుంటున్నాం. రైతు విశ్రాంతి భవనాన్ని వినియోగంలోకి తీసుకవచ్చే చర్యలు చేపట్టాం. వసతు లు, సౌకర్యాలు పూర్తిస్థాయిలో మెరుగుపరుస్తాం.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.3၊ కనిష్ఠం 28.2



ఆదిలాబాద్
జిల్లా వార్తలు
1
ఆదివారం 20 ఏప్రిల్ 2025



సంస్మరణ సభ కోసం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



● ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం

ఇంద్రవెల్లి అమరులకు.. సర్కార్ సలాం!

- 44 ఏళ్ల తర్వాత తొలగిపోయిన నిషేధాజ్ఞలు
- తొలిసారి అధికారికంగా అమరువీరులకు నివాళులు
- రూ.కోటితో స్మృతివనం.. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం
- భారీగా తరలిరానున్న గిరిజనం.. హాజరుకానున్న మంత్రి సీతక్క
- నేడు ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినం

ఆదిలాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా వస్తున్న నిషేధం, నిర్బంధాన్ని ఎత్తివేస్తూ ఇంద్రవెల్లి అమరువీరులకు సర్కార్ సలాం కొడుతోంది. ఇన్నాళ్లు అమరువీరులకు నివాళులర్పించేందుకు ప్రభుత్వాలు విధించిన ఆంక్షలు ఇక తొలగిపోతున్నాయి. ఇకపై గిరిజన అమరువీరులకు స్వేచ్ఛగా నివాళులు అర్పించే అవకాశం దక్కింది. సరిగ్గా 1981 ఏప్రిల్ 20న పోలీసు బలగాలు ఉద్యమకారులపై తుపాకీ గుండ్ల వర్షం కురిపించిన ఘటన.. ఇప్పటికీ ఆదివాసీ గిరిజనులు మరిచిపోలేకపోతున్నారు. 44 ఏళ్ల నుంచి అమరవీరులకు నివాళులర్పిస్తూ వస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రంలో గత ప్రభుత్వం ఆంక్షలను సడలిస్తూ అమరవీరులకు నివాళులర్పించినా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిషేధాజ్ఞలు ఎత్తివేస్తూ అమరులకు అధికారికంగా నివాళులర్పించేందుకు సిద్ధమైంది. ఇంద్రవెల్లి పోరుగడ్డను సెంటిమెంటుగా భావిస్తున్న కాంగ్రెస్ ఎన్నికలకు ముందు అమరవీరుల స్తూపం సమీపంలో భారీ బహిరంగ సభను నిర్వహించి సక్సెస్ అయ్యింది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈసారి ఏకంగా అధికారికంగా నివాళులర్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఆదివాసీ గిరిజనుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఆదివారం అమరవీరుల సంస్మరణ దినాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం, ఆదివాసీ సమాజం సిద్ధమవుతోంది.

ఘటన నేపథ్యం ఇదీ!

గత 44 ఏళ్ల క్రితం భూమి కోసం భుక్తి కోసం.. రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంపై పోలీసులు విరుచుకుపడి విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. ఇందులో 13మంది ఆదివాసీలు మరణించినట్లు అప్పటి ప్రభుత్వం లెక్కలు చెప్పింది. కానీ ఎందరో మంది మరణించగా.. అనేక మంది గాయాలపాలైనట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అప్పటి నుంచి ఇంద్రవెల్లి మండలం హిరాపూర్ గ్రామంలో ప్రతి ఏటా ఏప్రిల్ 20న అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఆదివాసీ గిరిజనులు అమరవీరులకు నివాళులర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఆనాటి భయంకరమైన ఘటనను గుర్తుచేసుకుంటూ జిల్లాలోని ఏజెన్సీ మండలాల పరిధిలోని ఆదివాసీ గూడాల్లో ఏప్రిల్ 20 అంటేనే ఉలిక్కి పాటు కనిపిస్తుంది. అప్పట్లో ఈ సంఘటన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దుమారం రేపింది. హక్కుల కోసం ఉద్యమించిన ఆదివాసీ బిడ్డలను గత ప్రభుత్వం నిర్ధాక్షిణ్యంగా అణచి వేసేందుకే ఈ మారణకాండకు పాల్పడినట్లు తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే ప్రతి యేటా మావోయిస్టు పార్టీ నేతలు ఇంద్రవెల్లి ఘటనను గుర్తు చేసుకుంటూ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిస్తూ వస్తున్నారు.

సెంట్‌మెంట్‌గా మారిన ఇంద్రవెల్లి

అధికారంలోకి వస్తే అమరవీరుల సాక్షిగా సంస్మరణ దినాన్ని అధికారికంగా నిర్వహిస్తామని గతంలో కాంగ్రెస్ హామీనిచ్చి అధికారంలోకి రాగానే అమలు చేసేందుకు సిద్ధమైంది. మొదటిసారి అధికారికంగా అమరవీరులకు నివాళులు అర్పిస్తోంది. గతంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లిలో దళిత, గిరిజన దండోరా పేరిట నిర్వహించిన భారీ బహిరంగ సభ సక్సెస్ కావడం రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పింది. ఈ సభనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందు కు దోహదం చేసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అప్పటి నుంచి ఇంద్రవెల్లిని సెంట్‌మెంటుగా భావించిన కాంగ్రెస్.. ఇక్కడి నుంచే ఆరు గ్యారెంటీ పథకాలను ప్రారంభించి పలు కార్యక్రమాలను చేపడుతూ వస్తోంది. అయితే గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే ఇంద్రవెల్లి ఘటన చోటు చేసుకుందంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఆ మచ్చను తొలగించుకునేందుకే కాంగ్రెస్ ఇప్పుడు అమరవీరుల సంస్మరణ దినాన్ని అధికారికంగా నిర్వహిస్తుందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

హామీ ఇచ్చి నెరవేర్చారు..

ఇంద్రవెల్లి ఘటనలో అమరులైన కుటుంబాలను ఆదుకుంటామని అప్పట్లో హామీనిచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి రాగానే

(తరువాయి 2వ పేజీలో...)

ఆనాటి పోలీసుల కాల్పుల్లో మా నాన్న మరణించాడు

: తొడసం హనుమంతు, ఇంద్రవెల్లి మండలం



కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం చాలా ఆనందంగా ఉంది. 1981 ఏప్రిల్ 20న జరిగిన పోలీసుల కాల్పుల్లో మా నాన్న తొడసం భీంరావు మరణించాడు. దీంతో మా కుటుంబం చాలా ఇబ్బందుల్లో పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అమరవీరుల కుటుంబానికి ఇళ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం, రుణాలు ఇవ్వడం గర్వించదగ్గ విషయం.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

: సోయం బాపురావు, మాజీ ఎంపీ, ఆదిలాబాద్



గతంలో అనేక ప్రభుత్వాలు వచ్చినా ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినాన్ని అధికారికంగా నిర్వహించలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం 44 ఏళ్ల తర్వాత మొదటిసారి అధికారికంగా అమరులకు నివాళులర్పించడం శుభ పరిణామం. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదివాసీ సమాజం తరపున ప్రత్యేక ధన్యవాదాలు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుంది. గతంలో ఎన్నో ప్రయత్నాలు జరిగినా.. ఆంక్షలు, నిర్బంధాలను ఎత్తివేయలేదు. ఆదివాసీల మనోభావాలను గౌరవించిన కాంగ్రెస్ అధికారికంగా నిర్వహించడం అభినందనీయం.

ఇంద్రవెల్లిలో నేడు అధికారికంగా ఆదివాసీ అమరవీరుల సంస్మరణ దినం

● అమరవీరుల స్తూపం వద్ద భారీ ఏర్పాట్లు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): 1981, ఏప్రిల్ 20న భూమి కోసం.. భుక్తి కోసం.. విముక్తి కోసం అమరులైన ఆదివాసీ అమరవీరుల సంస్మరణ సభను తొలిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు ఐటీడీఏ అధికారులు ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఆదివాసీ అమరవీరుల స్తూపం వద్ద ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఆదివాసీ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహిస్తుండగా ఆదివాసీ అమరవీరులకు నివాళులర్పించేందుకు వస్తున్న అమరవీరుల కుటుంబాలతో పాటు ఉమ్మడి జిల్లా నుంచి వచ్చే ఆదివాసీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

● సభ ఏర్పాట్లను పరిశీలించిన ఖానాపూర్ ఎమ్మెల్యే

అమర వీరుల సంస్మరణ సభకు ప్రభుత్వం తరఫున అన్ని రకాల ఏర్పాటను పూర్తి చేశామని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శనివారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అమర వీరుల స్తూపం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 44 సంవత్సరాల తర్వాత అమర వీరుల సంస్మరణ సభను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క రానున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అమర వీరుల కుటుంబాలకు ఇప్పటికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. ఉమ్మడి ఆదిలాబాదు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చేతుల మీదుగా కొంతమంది అమర వీరుల కుటుంబాలకు 10 లక్షల లోన్లు అందిం చనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, మేధా వులు ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు, పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమా న్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, రగల్ జెండా కమిటీ అధ్యక్షుడు తోడసం నాగోరావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ జహీర్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్‌రావు, మాజీ సర్పంచ్ కోరెంగ సుంకట్ రావు, మెస్రం నాగనాథ్, తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

మూడు బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గతంలో రెన్యూవల్ కాని మూడు బార్ల నోటిఫికేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆదిలాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ రేండ్ల విజేందర్ పేర్కొన్నారు. ఆసక్తి గల వారు అప్లికేషన్ ఫార్మ్ పాటు రూ.లక్ష డీడీ, చలాన్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పేరున చెల్లించి, ఈనెల 26 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలకు సెల్ నెం. 8712658771, 8712658780 ద్వారా సంప్రదించాలని తెలిపారు.

'ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించాలి'

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పూర్క బాపూరావు కోరారు. మండలకేంద్రంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. మొత్తం 15 కుటుంబాలు కాదు ఇంకా చాలానే బాధిత కుటుంబాలు ఉన్నాయన్నారు. కమిటీ వేసి సర్వే చేసి ఆ కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. అలాగే ఎకరం భూమిలో స్మృతి వనం ఏర్పాటు చేస్తే ప్రతీ సంవత్సరం నివాళులర్పించడానికి సభ, సమావేశాలకు స్థలం సరిపోకపోవడంతో అదనంగా రెండు ఎకరాల భూమి కేటాయించాలని, వ్యవసాయం చేసే అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం భూమి కేటాయించాలని ఆయన పేర్కొన్నారు.

'భూ భారతితో చేసిందేమీ లేదు'

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి పేరుతో ఆదిలాబాద్‌లో మంత్రి పొంగులేటి, సీతక్క పర్యటన రైతులకు చేసింది ఏమీ లేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేసే దిశగా ప్రతీఒక్క కార్యకర్త ముందుకు రావాలని పేర్కొన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మొదట పార్టీ కార్యాలయంలో రజతోత్సవ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, నారాయణ, ప్రహ్లద్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అండ

● రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ● జిల్లాలోని పలు మండలాల్లో మంత్రి సుడిగాలి పర్యటన

ఇచ్చోడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొత్తం 97 ఉపకరణలను పంపిణీ చేశామన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం రూ. 50 కోట్లు కేటాయించిందని, పనులు టెండర్‌దశలో ఉన్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ద్వారా పంపిణీ చేస్తున్న ఈ ఉపకారణాల కార్యక్రమం అభినందనీయమన్నారు. ప్రధాని ఫొటో సైతం ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన సూచించారు. ఇచ్చోడ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ కుమ్రం సత్యవతి ఫొటో ఫ్లెక్సీలో లేకపోవడంతో ప్రొటోకాల్ పాటించడంలేదని అధి కారులపై నాయకులు నిలదీయడంతో అప్పటికప్పుడు అధికారులు సత్యవతి స్టిక్కర్లను అతికించడంతో ఫ్లెక్సీ వివాదం సద్దుమనిగింది. ఇదిలా ఉండగా.. మంత్రి సీతక్క కార్యక్రమం కోసం ఇచ్చోడ ప్రధాన రహదారిపై ఉన్న దుకాణ సముదాయాలను మధ్యాహ్నం ఒంటి గంట వరకు మూసివేయించడంతో వ్యాపారస్తులకు ఇబ్బందులు తలెత్తాయి. ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, డైరెక్టర్ శైలజ, దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ వీరయ్య, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కలెక్టర్ రాజర్షి షా

● అన్ని రంగాల్లోనూ రాణించాలి

ఆదిలాబాద్ రూరల్: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్తూ అన్ని రంగాల్లోనూ రాణించాలని రాష్ట్ర మంత్రి సీతక్క సూచించారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై దివ్యాంగులకు వీ ల్ చైర్‌లు, బ్యాటరీ సైకిళ్లు, ఉపకరణాలను పంపిణీ చేశారు. బ్యాటరీ ట్రై సైకిల్‌లను అందచేసి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ. . దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. దివ్యాంగులకు కేటాయించిన సంక్షేమ పథకాలను వారి పేరిట నే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారికి ఆర్థిక భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. దివ్యాంగులకు విద్య ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ అమలు చేస్తున్నామని, వారి సంక్షేమం కోసం ఈసారి రూ.50 కోట్లు కేటాయించామన్నారు. ముప్పై కోట్ల రూపాయాలతో వారికి అవసరమైన ఉపకరణాలను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రభుత్వాలు అందిస్తున్న సహాకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాల్లో ఆత్మ విశ్వాసంతో రాణించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీడబ్ల్యూవో మిల్కా, అధికారులు, దివ్యాంగుల సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ పంటను కొనుగోలు చేస్తుంది

రైతు పండించిన ప్రతీ పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. మార్క్ ఫెడ్ సౌజన్యంతో గడిహత్నూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి కొనుగోళ్లను మంత్రి ప్రారంభించారు. ముందుగా తూకం యంత్రాలకు పూజలు చేసి జొన్నలను తూకం చేశారు. అనంతరం తొలి రైతును సత్కరించారు. రైతు సంఘం నేతలు పలు సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందించగా.. వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పక్క రాష్ట్రాల నుంచి వచ్చే పంటలను నియంత్రించాలని, జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని సూచించారు. ఇతర జిల్లా లతో పోల్చుకుంటే ఆదిలాబాద్ లో ప్రత్యేక పరిస్థితులుంటాయని, ఇక్కడ జొన్న, పత్తి పంటలు అధికంగా సాగు చేస్తున్నారని తెలిపారు. స్థానిక పరిస్థితులను బట్టి ఎకరానికి 14 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, మార్క్ ఫెడ్ డీఎం ప్రవీణ్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో జొన్నల కొనుగోలు ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క



ధనూర్ గ్రామంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తూ..

● ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నాం

బోథ్: గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రితో పాటు పార్టీ నాయకులు ఇచ్చిన హామీలన్నింటిని దశలవారీగా నెరవేర్చడం జరుగుతున్నదని రాష్ట్ర మంత్రి సీతక్క పేర్కొన్నారు. శనివారం మండలంలోని మూడు కోట్ల 30 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన బ్రిడ్జి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యేతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ధన్నూర్ గ్రామంలో ఏర్పాటైన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కృషి చేస్తుందన్నారు. పేదలందరికి సన్న బియ్యంతో భోజనం అందించాలన్న ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేనివిధంగా రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందిస్తున్నమన్నారు. రాష్ట్రంలోని అన్ని పైలెట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లబ్ధిదారుల ఇష్టానుసారంగా నిర్మించుకునే అవకాశం కల్పించడం జరిగింది అన్నారు. ప్రభుత్వం ఐదు లక్షలు ఇస్తుందని, లబ్దిదారులు కొంత డబ్బు కలుపుకొని వారికి అనువుగా ఉండే విధంగా నిర్మించుకునే ఆస్కారం ఉందన్నారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన జొన్న పంటను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పేర్కొన్నారు.

● పోలీస్ నిఘా నీడన

మండలంలో జరిగిన మంత్రి పర్యటనకు భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఎస్సై ప్రవీణ్‌తో పాటు అదనపు పోలీసు బలగాలను రంగంలోకి దించారు. గతంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు నిర్వహించిన తరహాలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించగా ఎస్పి అఖిల్, డీఎస్పీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీ దండే విట్టల్, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి, డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, పర్యాటక శాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.రాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పి. చంటి, స్థానిక నాయకులు ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగ భగ

● ఆదిలాబాద్‌లో అత్యధికంగా 42.2 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదు



● ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన ప్రధాన రోడ్డు

వివరాలు 3వ పేజీలో...

మేతకు వెళ్లిన ఎడ్లు.. విద్యుత్ తీగలకు తగలి మృత్యువాత

● ఈదురుగాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభం ● కేశవపట్నంలో విద్యుత్ తీగలకు బలైన ఐదు ఎడ్లు ● ఆదుకోవాలన్న బాధిత కుటుంబాలు

ఇచ్చోడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభం నేలకొరిగి విద్యుత్తు తీగలు తగిలి ఐదు ఎడ్లు మృత్యువాత పడ్డ సంఘటన ఇచ్చోడ మండలంలోని కేశవపట్నం గ్రామంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు విద్యుత్తు స్తంభం నేలకొరిగింది. గాయిద్‌పెల్లి నుంచి గుండివాగు వెళ్లే త్రీఫేజ్ విద్యుత్తు లైన్ స్తంభం కిందపడిపోయింది. దీంతో గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్, షేక్ ఇక్బాల్, షేక్ ఖమర్‌లకు చెందిన ఒక్కో ఎద్దు, షేక్ ఆలీకి చెందిన రెండు ఎద్దులు శనివారం ఉదయం మేతకోసం పంటపొలాలకు వెళ్లాయి. కాగా, అక్కడే కింద పడిపోయిన విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే ఎద్దులు మృత్యువాత పడ్డాయి. వ్యవసాయ పనికి ఉపయోగపడే ఎడ్లు మృతి చెందేసరికి రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎద్దు విలువ ఒక్కటి దాదాపు రూ.65 వేలకు పైగా ఉంటుందని, మొత్తం రూ.3 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు.



విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందిన ఎడ్లు